

మడికొండ : బీఆర్‌ఎస్‌లోకి మహిళలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కడియం

# కాంగ్రెస్ దివాళా కోరు పార్టీ

- ఆ పార్టీ మాటలు నమ్మితే ఆగమైతం
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన నాయకులు

వేలేరు, అక్టోబర్ 1 : కాంగ్రెస్ దేశంలో, రాష్ట్రంలో దివాళా తీసిన పార్టీగా మారిందని, రాష్ట్రానికో పాలసీని అమలు చేస్తున్న ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మితే ఆగమైపోతామని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వేలేరు మండలం పీచర గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కార్డు స్కీంలను ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మి వారికి ఓటు వేస్తే ఆగమైపోతామని అన్నారు. బీజేపీకి నాలుగైదు సీట్లు వస్తే ఎక్కువని, అది పేపర్లకే పరిమితమైన పార్టీ అని అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ధర్మసాగర్, వేలేరు, తరిగొప్పుల, నర్మెట్ట మండలాలను కలిపి జనగామ వరకు డబుల్ రోడ్డు వేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పీచరకు చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రఘునాయకుల ప్రమోద్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా ఆయనకు కడియం శ్రీహరి కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే, గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఎస్పీ నాయకులు సూమారు 50 మంది ఎమ్మెల్సీ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మ్యాక రవీందర్, గ్రామ అధ్యక్షుడు తిరుపతి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాంగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, గోదల రాజిరెడ్డి పాల్గొన్నారు.

**ఉనికిచర్ల అభివృద్ధి బాధ్యత నాదే**

మడికొండ : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఉనికిచర్ల గ్రామం అభివృద్ధి బాధ్యత తనదేనని బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. గ్రేటర్ 64వ డివిజన్ ఉనికిచర్ల గ్రామంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాగా, అభివృద్ధి పనులతో పాటు బస్ సౌకర్యం, కమ్యూనిటీ భవనాలు కావాలని గ్రామస్తులు కోరడంతో వాటిని కూడా త్వరగా మంజురు చేస్తామని కడియం హామీ ఇచ్చారు. అనంతరం ఇతర పార్టీలకు చెందిన సుమారు 35 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి పాల్గొన్నారు.

**ఖబరస్థాన్ నిర్మాణ మంజూరు పత్రం అందజేత**

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ముస్లింల కోసం ఖబరస్థాన్ నిర్మాణానికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆదివారం స్థానిక ముస్లింలకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో మంజూరు పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ముస్లింలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్టల శ్రీలత, ధర్మసాగర్ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌చంద్రప్రసాద్, ముస్లింలు ఎండీ యాకూబ్ పాషా, షంశొద్దీన్, ఖాసీం, ఎండీ హాఫీజ్, ముజ్జు పాల్గొన్నారు.



తరగతులను ప్రారంభిస్తున్న బాబుశంకర్, సునీత, గంగు ఉపేంద్రశర్మ

## అర్చకులకు శిక్షణా తరగతులు ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1 : ధూప, దీప, నైవేద్య అర్చకులు ఆగమ శాస్త్ర ప్రకారంగా ఆధ్యాత్మిక భావన కల్గించేలా ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత అన్నారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ధూప, దీప, నైవేద్య అర్చకులకు పునఃశ్చరణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకులు బాబుశంకర్,తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వీటిని ప్రారంభించారు. అనంతరం సునీత మాట్లాడుతూ ఆగమవిరుద్ధంగా ఎవరూ ప్రవర్తించినా ఉపేక్షించమని హెచ్చరించారు. 300 మంది అర్చకులు శిక్షణ తీసుకున్నారు. శృంగేరి సంస్థాన పురాణ పండితులు వంగల సోమయాజులు, పండితులు కొమాల్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ, పాతర్లపాటి రవీందర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, తనుగుల రత్నాకర్, వీరశైవ ఆగమం మఠం భువనేశ్వర్, సంతోషస్వామి, శివప్రసాద్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు కవిత, సంజీవరెడ్డి, డీ అనిల్ పాల్గొన్నారు.

# బుద్ధ భవన్‌కు గొప్ప చరిత్ర ఉంది

- నాకు స్ఫూర్తి, ధైర్యాన్ని ఇచ్చి, ఈ స్థాయికి తీసుకొచ్చింది
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- ఘనంగా బుద్ధ భవన్ పునర్నిర్మాణ భూమి పూజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1 : కుమార్‌పల్లిలోని బుద్ధభవన్‌కు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, ఈ ప్రాంత ప్రజలు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ కుమార్‌పల్లిలో బుద్ధ భవన్ పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బుద్ధభవన్ అందరికీ ఉద్యమ వారధిగా, చైతన్య వేదికగా, విజ్ఞాన కేంద్రంగా వెలిసిందన్నారు. బుద్ధ భవన్ నుంచి వెళితే ఏదో తెలియని గొప్ప అనుభూతి కలిగేదన్నారు. ఇక్కడి స్థానికులే కూలీలుగా మారి బుద్ధ భవన్, యూత్ భవన్‌ను నిర్మించారన్నారు. పునర్నిర్మాణంలో ఇక్కడి ప్రజల సౌకర్యార్థం, అందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. కామ్రేడ్ బీఆర్ భగవాన్ దాస్ పేదల పక్షపాతి అన్నారు. ప్రజల కోసం ఆయన నిరంతరం పనిచేశారన్నారు. ఇక్కడి ప్రజలు రాజకీయంగా నాకు స్ఫూర్తిని, మనోధైర్యాన్ని ఇచ్చి ఆశీర్వదించారన్నారు. బుద్ధ భవన్ భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. అంతకు ముందు అశోకా జంక్షన్‌లోని బీఆర్ భగవాన్‌దాస్ విగ్రహానికి చీఫ్‌విప్ పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఉట్టిపడిన సంస్కృతి సంప్రదాయం..**

కాగా, బుద్ధ భవన్ పునర్నిర్మాణ భూమి పూజకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మలతో మహిళలు తరలివచ్చారు. తీరొక్క పూలతో రూపొందించిన బతుకమ్మలను తీసుకొచ్చి, ఆడి పాడారు. కళాకారులు డప్పు చప్పుళ్లతో హోరెత్తించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధపౌర్ణమి చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, జీ రాములు, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, సుంకు నర్సింగారావు, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, జోరిక రమేశ్, వీరగంటి రవీందర్, బుద్ధ భవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బీఆర్ అంబేద్కర్, వంగల సుదర్శన్, ముఖ్య సలహాదారులు అంకేసరపు సారయ్య, పునర్నిర్మాణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బీఆర్ లెనిన్, గోకారపు శ్యాంకుమార్, కన్వీనర్ కునమల్ల జితేందర్‌నాథ్, రాష్ట్ర నాయకుడు సతీశ్, కొత్తూరు జాక్ కన్వీనర్ క్రాంతి కుమార్, బొల్లపల్లి చందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- చేయూత వాహనం ప్రారంభం

వరంగల్, అక్టోబర్ 1 : వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద చేయూత వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ వృద్ధులు అపార జ్ఞాన సంపన్నులన్నారు. వారి ఆలోచనలు, సలహాలు, సూచనలు పాటిస్తే భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసుకోవచ్చన్నారు. కాలనుగుణంగా కన్నపిల్లలు పట్టించుకోకపోవడంతో వృద్ధులు ఆశ్రమాలను ఆశ్రయించడం బాధాకరమన్నారు. వృద్ధులకు సమస్యలు ఉంటే క్యాంపు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ఒక్క ఫోన్ కాల్ చేస్తే తానే వారి వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. పలువురి వృద్ధుల కోరిక మేరకు యాదాద్రితో పాటు పలు పుణ్య క్షేత్రాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు పంపించి వారి మానసిక ఆనందాన్ని పెంపొందించినట్లు తెలిపారు. వృద్ధులకు జయశంకర్ పెన్షనర్ హెల్ప్ డెస్క్ లాంటి సదుపాయాల కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధుల అవగాహన, అభినందన కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి మధురిమ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ హాజరై మాట్లాడారు. వృద్ధులకు చట్టపరమైన సలహాలు, సూచనలు అందజేసేందుకు రాష్ట్రంలోనే మొదటి సారిగా కేయూ పోలీస్ స్టేషన్‌లో వృద్ధ మిత్ర సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం 80 ఏళ్లుపై బడిన వృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో రమేశ్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ అనితారెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు తెరాల యుగేంధర్, దామెర నర్సయ్య, పీఎల్‌ఎన్ రావు, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ గీతాలక్ష్మి, సీడీపీవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# వరంగల్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

**మేయర్ గుండు సుధారాణి**

వరంగల్, అక్టోబర్ 1 : ప్రజల భాగస్వామ్యంతో చారిత్రక వరంగల్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ఆధ్వర్యంలో వార్షిక స్వచ్ఛతా హీ సేవా-2023, ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0, సఫాయి మిత్ర సురక్ష శివర్‌లో భాగంగా ఆదివారం భద్రకాళీ ఆలయం నుంచి ఆర్చ్‌గేట్ వరకు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళీ ఆలయం నుంచి విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ చెత్తను నిర్మూలించడంలో మేము సైతం అంటూ అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. వరంగల్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంతో ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు. మహాత్మగాంధీ ఆశయాలకు అనుగుణంగా ఏక్ తారీఖ్ ఏక్ గంటా, ఏక్ సాల్ ఏక్ గంటా నినాదంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సఫాయి అన్నకు సలాం అంటూ పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సఫాయి కార్మికుల సేవలకు గుర్తుగా ఎంజీఎం సెంటర్‌లో సఫాయి అన్న, అక్కల విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పరిశుభతతో రోగాలు దరిదాపుల్లోకి రావన్నారు. నగర ప్రజలు, కార్మికుల సహకారంలో మూడేళ్లుగా క్రమం తప్పకుండా నగరంలో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌లో హ్యాట్రిక్ సాధించామన్నారు. వచ్చే స్వచ్ఛసర్వేక్షణ్ పోటీలో గ్రేటర్ వరంగల్‌కు మెరుగైన ర్యాంక్ సాధించేలా అందరూ తోడ్పాటు అందించాలని కోరారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల ద్వారా స్వచ్ఛత కోసం మనల్ని మనం అంకితం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు శేషు, ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు లైలా, వింగ్ అధికారులు, ట్రాన్స్‌జెండర్లు, నర్సింగ్ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



భద్రకాళీ ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా



క్రీడాకారులకు మెడల్స్ అందజేస్తున్న టీజీవో అధ్యక్షుడు జగన్మోహన్‌రావు

## ముగిసిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: నాలుగో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడలు కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిశాయి. మూడురోజులుగా జరుగుతున్న 4వ రాష్ట్రస్థాయి అండర్ 14, 17, బాలబాలికల ఫెన్సింగ్ పోటీల్లో విజేతలకు ముఖ్యఅతిథిగా గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు పాల్గొని మెడల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదే పట్టుదలను జాతీయస్థాయిలో కూడా చూపించి మన రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావాలని కోరారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము మాట్లాడుతూ అండర్ 17లో హిప్పీ బాలికల విభాగంలో డీ దీక్షిత పెద్దపల్లి గోల్డ్ మెడల్, జీ సిరివెన్నెల సిల్వర్ మెడల్, టీ త్రివేణి ఆదిలాబాద్ బ్రాంజ్ మెడల్, బాలుర విభాగంలో మేడ్చల్ జిల్లా ఆకాంక్ష గోల్డ్ మెడల్, వర్షిత్ సిల్వర్ మెడల్, విరాజ్ బ్రాంజ్ మెడల్, సంజయ్ మేడ్చల్ బ్రాంజ్ మెడల్, కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పోటీల్లో రాణించిన బాలబాలికలను త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్ కుమార్, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వీవీ రెడ్డి, డాక్టర్ గీతారెడ్డి, కుమార్, చారి, కిశోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.